
మగ్గం నేస్తున్న కార్మికుడు

నిండా ముంచారు..!

చేనేతపై వైసీపీ పాలకుల నిర్లక్ష్యం

- కోలుకోలేని స్థితికి పరిశ్రమ
- మూలన పడుతున్న మగ్గాలు
- అప్పుల ఊబిలోకి నేతన్నలు
- బయటపడలేక ఆత్మహత్యలు

నేతన్నకు ఇది గడ్డుకాలం. పెను సంక్షోభం. మరుగడే ప్రశ్నార్థకమైంది. ముడిసరుకుల ధరలు పెరిగిపోయాయి. అప్పుల పెట్టుబడితో చీర నేస్తే.. అడిగేవారు లేరు. డిమాండ్ లేదు. గిట్టుబాటు కాక నష్టాలు మూటగట్టుకున్నాడు. పరిస్థితి మారుతుందనీ, మంచి రోజులొస్తాయని నష్టాలను భరిస్తూ వచ్చాడు. అప్పులపాలయ్యాడు. అవి కుప్పలుగా పేరుకుపోయాయి కానీ, మంచిరోజులు మాత్రం రాలేదు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం రిక్తహస్తం చూపింది. చేనేత ఊసే మరిచింది. నేతన్న నేస్తం అంటూ కాస్త విదిల్చింది. అది కూడా అనర్హులకు, అధికార పార్టీ అనుయాయిలకే పంచింది. అర్హుడైన నేతన్నకు ఒరిగింది శూన్యం. గత ప్రభుత్వాలు ఇచ్చిన ప్రోత్సాహకాలు, సబ్సిడీలను కూడా అటకెక్కించింది. పూర్తిగా అంటే.. సంపూర్తిగా నేతన్నను నిర్లక్ష్యం చేశారు. కరోనాతో కునారిల్లిపోయిన చేనేత రంగానికి పాలకుల నిర్లక్ష్యం కోలుకోలేని దెబ్బతీసింది. పరిశ్రమ మనుగడే ప్రశ్నార్థకమైంది. అప్పుల మగ్గం వడకలేక, బతుకు బండి నడపలేక నేతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇవన్నీ నిత్యకృత్యమయ్యాయి. లెక్కలేనన్ని హృదయ విదారక ఘటనలు చూస్తున్నా.. పాలకుల మనసు కరగట్లేదు. కాసింత కరుణ చూపట్లేదు.

ధర్మవరం/పెనుకొండ టౌన్, మార్చి 25: అబ్బుర పరిచే వస్త్రకళా నైపుణ్యం చేనేతలది. సమస్యలతో పోరాటం చేస్తూ అతికష్టంగా మనుగడ సాగిస్తున్నారు. ఎంతో ఘన చరిత్ర ఉన్నా... రెక్కాడితేగానీ డొక్కాడని బతుకులు వారివి. రెక్కలు విరిగేలా... కీళ్లు అరిగేలా చాకిరీ చేస్తున్నా ఐదు వేళ్లు నోట్లోకి వెళ్లే పరిస్థితి లేదు. వైసీపీ అధికారంలోకి వచ్చాక చేనేత కార్మికులు కోలుకోలేనంతగా దెబ్బతిన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ఒకరిద్దరికి పదో.. పరకో.. చిల్లర రాల్చిన ప్రభుత్వం చేనేత సంరక్షణ చర్యలను పూర్తిగా పక్కనపెట్టింది. ఫలితంగా చేనేత వృత్తి మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలో వ్యవసాయం తరువాత చేనేత పరిశ్రమపై అత్యధికంగా ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో చేనేత మగ్గాలు 25 వేలకుపైగా ఉన్నాయి. వాటిపై లక్షలాది మంది ఆధారపడి జీవిస్తున్నారు. ధర్మవరంతోపాటు ముదిరెడ్డిపల్లి, సోమందేపల్లి, గోరంట్ల ప్రాంతాల్లో చేనేత కార్మికులు ఉన్నారు. స్వయం పోషకంగా ఉన్న ఈ రంగానికి కొద్దిపాటి ఊతం [illegible] వైసీపీ ప్రభుత్వం అవేవీ పట్టించుకోలేదు. గత ప్రభుత్వాలు ఇచ్చిన సబ్సిడీలు, ప్రోత్సాహకాలను కూడా నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయింది. 2020లో కరోనా నివారణకు చేపట్టిన లాక్‌డౌన్ చేనేత కార్మికుల వృత్తికి లాక్‌డౌన్‌గా పరిణమించింది. ఆరోజు నుంచి ఇప్పటి వరకు చేనేత పరిశ్రమ కోలుకోలేదు.

టీడీపీ హయాంలో ఊరట

టీడీపీ హయాంలో చేనేత సంరక్షణకు నూలు రంగంపై సబ్సిడీ ఇచ్చింది. చేనేత సహాయనిధి, పొదుపు నిధి, రంగుల కోసం, మరమగ్గాల రాయితీ కింద రూ.కోట్లు ఖర్చు చేసింది. 200 యూనిట్లు ఉచిత విద్యుత్ తోపాటు 50 ఏళ్లు దాటిన వారికి చేనేత పింఛన్ కింద రూ.2వేలు అందజేశారు. చేనేత పరిశ్రమను రక్షించడానికే కాకుండా కార్మికులకు వ్యక్తిగతంగా కూడా కొంత ఊరటనిచ్చేవి. టీడీపీ హయాంలో అమలైన పథకాలన్నింటినీ వైసీపీ అధికారంలోకి రాగానే రద్దుచేసింది. దీంతో చేనేత కార్మికులకు గడ్డిపోస సాయం కూడా వారికి లభించలేదు. చేనేత వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ ఉంది. నైపుణ్యం కలిగిన కార్మికులు ఉన్నారు. ప్రభుత్వ ఆదరణే కరువైంది. కార్మికుల ఉపాధి విషయాన్ని గాలికొదిలి వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో ఏటా రూ.200 కోట్లు మాత్రం కేటాయిస్తూ వచ్చింది. అది చేనేత జౌళిశాఖ ఉద్యోగుల జీతాలు, నేతన్న నేస్తానికి కూడా చాలలేదు. అంతలా గత ఐదేళ్లలో చేనేత రంగం నిర్లక్ష్యానికి లోనైంది. నేతన్న నేస్తం కూడా అనర్హుల పాలవుతున్నట్లు పలువురు చేనేత కార్మికసంఘం నాయకులు పేర్కొంటున్నారు. చేనేత రంగంపై ఆధారపడిన రంగుల అద్దకం, పాలిష్ పరిశ్రమలు సైతం మూతపడుతున్నాయి.

ముడిసరుకులు రాయితీతో ఇవ్వాలి



నాకు రెండు మగ్గాలున్నాయి. ప్రస్తుతానికి ఒక మగ్గం ఎత్తిపెట్టేశా. కరోనా నుంచి చేనేత పరిశ్రమ కుదేలైంది. నేసిన చీరకు గిట్టుబాటు ధరలేదు. ప్రభుత్వం స్పందించి చేనేత ముడి సరుకులు రాయితీతో అందించడంతోపాటు పనులు కల్పిస్తే బాగుంటుంది. కార్మికుడు నేసిన చీరకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి.

శ్రీరాములు, చేనేత కార్మికుడు, ధర్మవరం


చుట్టిపెట్టిన చేనేత మగ్గం

చేనేత పరిశ్రమను రక్షించాలి



చేనేత పరిశ్రమను రక్షించకపోతే కార్మికులకు ఆకలిచావులే శరణ్యం. వైసీపీ ఐదేళ్ల పాలనలో చేనేతలకు ఒరిగిందేమీ లేదు. పైగా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయలేదు. నేతన్న నేస్తం కొందరికే ఇస్తున్నారు. కార్మికులకు పని కల్పిస్తే నేతన్న నేస్తం లేకపోయినా బతుకుతారు. పనిలేని కారణంగా చాలామంది వేరే వృత్తులవైపు వెళ్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం.. చేనేత కార్మికులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వెంకటనారాయణ, చేనేత కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి

కనుమరుగవుతున్న రంగుల అద్దకం పరిశ్రమ



నేతన్న చీర నేయాలంటే మొదట దానికి సంబంధించిన రంగులు సిల్కు దారాలకు కలర్ నిర్ణయించుకుని, ఫ్యాక్టరీలో రంగు అద్దించుకోవాల్సి ఉంది. అలాంటి చిన్న ఫ్యాక్టరీలు ఐదేళ్ల క్రితం 20 ఉండేవి. నేడు ఐదు మాత్రమే పనిచేస్తున్నాయి. అవికూడా అంతంతమాత్రంగానే నడుస్తున్నాయి. చీర పూర్తయిన తరువాత పాలిష్ చేసేవారు గతంలో వీధికి ఒకరు ఉండేవారు. ఇప్పుడు వారి జాడేలేదు.

- మరియప్ప, రంగులు అద్దే కార్మికుడు, సోమందేపల్లి

కుటుంబ పోషణ భారమైంది..

ఇతరుల వద్ద కూలి పనికి వెళ్లి జీవనం సాగించే నేను వివాహం అనంతరం సొంతంగా మగ్గాలు ఏర్పాటు చేసుకున్నా. ప్రస్తుతం ముడిసరుకు ధరలు పెరిగిపోయాయి. దీంతో మాస్టర్ వీవర్స్ ముడిసరుకులు ఇవ్వట్లేదు. చేసేదిలేక ఉన్న మగ్గాలను మూలన పెట్టి ఇతరుల వద్ద పనులకు వెళ్తున్నా. టీడీపీ హయాంలో వడ్డీలేని రుణాలు, ఆదరణ పనిముట్లు, ముడిసరుకుపై సబ్సిడీ ఇచ్చేవారు. ప్రస్తుతం మాస్టర్ వీవర్స్‌కు మాత్రమే నేతన్న నేస్తం ఇస్తున్నారు. మేము కూడా చేనేత కార్మికులమే. ఇది తప్ప వేరే వృత్తి తెలియదు. మాకు కూడా పథకాలు అందించాలి.

- చంద్రశేఖర్, చేనేత కార్మికుడు



పట్టుచీరల పాలిష్ క్లస్టర్ ఏర్పాటు చేయాలి

సంకల్పదీక్ష చేపట్టిన పాలిష్ సెంటర్ నిర్వాహకుడు



సంకల్పదీక్ష చేస్తున్న పట్టుచీరల పాలిష్ సెంటర్ నిర్వాహకుడు నరసింహులు

ధర్మవరం, మార్చి 25: పట్టణంలో పట్టుచీరల పాలిష్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పాలిష్ సెంటర్ నిర్వాహకుడు బీఎల్ నరసింహులు సోమవారం సంకల్పదీక్ష చేపట్టారు. స్థానిక కాలేజ్ సర్కిల్‌లో పోలీస్‌స్టేషన్ సమీపాన ఆయన దీక్షకు కూర్చున్నారు. ఆయన మాట్లాడుతూ.. ధర్మవరంలో దాదాపు 10వేల మందిదాకా పట్టుచీరలకు పాలిష్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ధర్మవరంపట్టణంలో పట్టుచీరల పాలిష్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని, 50శాతం సబ్సిడీతో రూ.2లక్షల రుణం ఇవ్వాలనీ, 300 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున దీక్షలు చేపట్టరాదంటూ నరసింహులును పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆయనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


భక్తులతో కిటకిట లాడుతున్న బెంగళూరు రోడ్డు

ఆదిశేషుడిపై వైకుంఠవాసుడు

దేవేరుల సమేతుడై శ్రీవారి దర్శనం.. పులకించిన భక్తజనం

కదిరి, మార్చి 25: శ్రీఖాద్రీశుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవారు.. ఆదిశేషుడిపై విహరించారు. ఉత్సవాల్లో తొలిసారిగా శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు కూడా శేషవాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజ, హోమం అనంతరం యాగశాల నుంచి బయలుదేరిన శ్రీవారు తిరువీధుల్లో విహరించారు. సంధ్యాసమయంలో దేవేరుల సమేతుడై స్వామివారు.. ఆదిశేషుడిపై దర్శనమిచ్చారు. పాలసంద్రాన ఆదిశేషుడిపై పవళించడం శ్రీమహావిష్ణువుకు ప్రీతిపాత్రం. శ్రీమహావిష్ణు దశావతారాల్లో ఒక్కటైన నారసింహుడు ఆదిశేషుడిని కోరి.. వాహనంగా మార్చుకున్నారని భక్తులు చెబుతారు. ఈ ఉత్సవానికి ఎనలేని ప్రాధాన్య త ఉంది. పక్షం రోజులపా టు సా గే అన్ని ఉత్సవాల్లోనూ నారసింహుడు మాత్రమే దర్శనమిస్తారు. శేషవాహనంపై మాత్ర మే అమ్మవార్ల సమేతుడిగా మాడవీధుల్లో విహరిస్తారు. ఈ ఉత్సవానికి తనకల్లు మండంలోని కొక్కంటి జ్యోతి రావడం ఆనవాయితీ.


ఆదిశేషుడిపై దేవేరుల సమేతుడైన నారసింహుడు

నేడు సూర్య, చంద్రప్రభ వాహన సేవలు

శ్రీవారి బ్రహోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు సూర్య, చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం వేళ సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు.

పోటెత్తిన భక్తులు

శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా కదిరి పౌర్ణమికి ప్రత్యేక స్థానముంది. సోమవారం కదిరి పౌర్ణమి సందర్భంగా స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వేలాదిగా తరలివచ్చారు. పౌర్ణమిరోజున శేషవాహనంపై స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు తండోపతండాలుగా వచ్చారు. జిల్లావాసులతోపాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో వచ్చారు.

కదిరికి చేరిన కొక్కంటి జ్యోతి

తనకల్లు: మండలంలోని కొక్కంటి గ్రామంలోని పాలెగాళ్ల ఇంటి నుంచి జ్యోతి బయలుదేరి కదిరి లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్లకు రావడం ఆనవాయితీ. కొక్కంటి పాలెగాడు దినకర్ ప్రసాద్‌నాయుడు ప్రత్యేక పూజల అనంతరం జ్యోతిని కదిరికి పంపారు. కొక్కంటి నుంచి కాలినడకన నల్లచెరువు మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి ఆలయం మీదుగా జ్యోతి కదిరి శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సోమవారం రాత్రి చేరుకుంది. కొక్కంటి జ్యోతికి కదిరి బ్రహోత్సవాల్లో ప్రత్యేక స్థానముంది. కార్యక్రమంలో పలువురు భక్తులున్నారు.


కదిరికి బయల్దేరిన కొక్కంటి జ్యోతి

ఉష్ణోగ్రతలు (సోమ)	గరిష్ఠం	కనిష్ఠం
పుట్టపర్తి	37.0	24.0
కదిరి	37.0	23.0
ధర్మవరం	38.0	24.0
హిందూపురం	37.0	23.0
పెనుకొండ	37.0	24.0

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.34 మంగళవారం (సాయంత్రం)	4.58 బుధవారం (ఉదయం)
కదిరి	6.31 మంగళవారం (సాయంత్రం)	5.04 బుధవారం (ఉదయం)
ధర్మవరం	6.36 మంగళవారం (సాయంత్రం)	5.01 బుధవారం (ఉదయం)
హిందూపురం	6.35 మంగళవారం (సాయంత్రం)	4.59 బుధవారం (ఉదయం)
పెనుకొండ	6.33 మంగళవారం (సాయంత్రం)	5.02 బుధవారం (ఉదయం)

భక్తి పారవశ్యం

ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి రథోత్సవం

ఒళ్లు జలదరించే విన్యాసాలు

హిందూపురం అర్బన్, మార్చి 25: భక్తి పారవశ్యంతో తమిళులు ఒళ్లు జలదరించే విన్యాసాలు చేశారు. వీపునకు కొక్కేలు గుచ్చుకుని, క్రేన్‌కు వేలాడుతూ భక్తిని చాటుకున్నారు. చిన్నా పెద్దా తేడాలేకుండా నోటికి, నాలుకకు శూలాలు గుచ్చుకుని, భక్తి పారవశ్యంలో మునిగారు. స్థానిక పలనీనగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో స్థిరపడిన తమిళులు సుబ్రహ్మణ్యేశ్వరుడి రథోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. వారికి ఏ కష్టమువచ్చినా వారి ఇష్టదైవం సుబ్రహ్మణ్యస్వామికి మొక్కుకుంటారు. వారి కష్టాలు తీరిన తరువాత ఇలా మొక్కుబడులు చెల్లించుకుంటారు. కోరిన కోర్కెలు తీరడంతో తమిళులతోపాటు హిందూపురం ప్రాంతవాసులు కూడా మెక్కుబడులు చెల్లిస్తున్నారు. వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది.


నాలుకకు శూలం గుచ్చుకుని కాళీమాత వేషధారణలో మహిళ


క్రేన్‌కు వేలాడుతూ భక్తిని చాటుతున్న యువకులు


మొక్కు తీర్చుకుంటున్న మహిళ

రంగుల పండుగ

హిందూపురం అర్బన్, మార్చి 25: రంగుల పండుగ హోలీని సోమవారం జిల్లావ్యాప్తంగా సంబరంలా చేసుకున్నారు. చిన్నాపెద్దా తేడాలేకుండా అన్నివర్గాలవారు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. ఉదయం నుంచే రంగులు చల్లుకోవడం ప్రారంభించారు. పట్టణంలోని కంసలపేట, వక్కలబజార్, శ్రీకంఠపురం, మోడల్ కాలనీ, లక్ష్మీపురం, నానెప్పనగర్, ముక్కడిపేట, మెయిన్‌బజార్ తదితర ప్రాంతాల్లో హోలీ వేడుకలు చేసుకున్నారు. తూమకుంట పారిశ్రామిక వాడలో బీహారీలు రంగులు చల్లుకున్నారు.


శ్రీకంఠపురంలో యువతుల హోలీ వేడుక


నీటిని చల్లుకుంటూ..

దేవుడి వద్ద రాజకీయం

వైసీపీ కవ్వింపు చర్య

టీడీపీ కార్యకర్తపై చేయిచేసుకున్న వైసీపీ నాయకులు

ఆలయం వద్ద ఉద్రిక్తత

హిందూపురం, మార్చి 25: ఎన్నడూలేని విధంగా చిలమత్తూరు లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం సందర్భంగా వైసీపీ రాజకీయ ఘర్షణకు దిగింది. చిలమత్తూరు మండల కేంద్రంలో కనుమ శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం సోమవారం జరిగింది. టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, చిలమత్తూరు మండల నాయకులు హాజరయ్యారు. బస్టాండు నుంచి ఆలయం వద్దకు టీడీపీ నాయకులు వెళ్లారు. అప్పటికే ఆలయంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక, ఆమె భర్త వేణురెడ్డి, నాయకురాలు మధుమతిరెడ్డి, ఎంపీపీ పురుషోత్తంరెడ్డి ఉన్నారు. ఇరుపార్టీల వారు పూజల్లో పాల్గొన్నారు. అక్కడి నుంచి మూల విరాట్‌ని రథం వద్దకు తీసుకొచ్చే కార్యక్రమం ప్రారంభించారు. ఆలయం వెలుపలకు రథానికి సంబంధించి అడ్డుకట్లు, మూలవిరాట్‌ని తీసుకొచ్చారు. ఈ సమయంలో టీడీపీ నాయకులు.. దేవుడికి ముందు వైపున వెళ్తున్నారు. ఆ సమయంలో వైసీపీ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. కొంతమంది టీడీపీ నాయకులను తోసివేశారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం తలెత్తింది. అక్కడ జనం ఎక్కువగా ఉండటంతో ఏమి జరుగుతుందో అర్థం కాని పరిస్థితి. ఈ సందర్భంగా కొందరు వైసీపీ నాయకులు.. టీడీపీ కార్యకర్తలపై చేయి చేసుకున్నారు. అక్కడే ఉన్న బీకే పార్థసారథి.. వైసీపీ నాయకులకు హెచ్చరించారు. దేవుడి వద్ద చిల్లర చేష్టలు చేయకండనీ, ఇలాంటివి చాలా చూశామంటూ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య కాసేపు వాగ్వాదం, తోపులాట జరిగాయి. టీడీపీ పెద్దలు అక్కడ ఘర్షణ పడటం మంచిది కాదని ముందుకు కదిలారు. దాంతో సమస్య సద్దుమణిగింది.

భక్తుల ఆగ్రహం

బ్రహ్మరథోత్సవం సందర్భంగా ఘర్షణకు దిగడంపై ఆలయం వద్ద ఉన్న భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవుడి వద్ద చిల్లర రాజకీయాలు చేయడమేమిటని కొందరు ప్రత్యక్షంగా విమర్శించారు. ఇరుపార్టీల నాయకులు ఆలయం వద్దకు వెళ్లడంతో ఎన్నికల వేళ జాగ్రత్త పడాల్సిన పోలీసులు అక్కడ లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది.


టీడీపీ కార్యకర్తలపై దాడి చేస్తున్న వైసీపీ నాయకులు

వైసీపీ కోసం.. చట్ట విరుద్ధ ప్రచారం


లోలూరులో ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ అంజన్‌రెడ్డి (వృత్తంలో)

శింగనమల: మండలంలో లోలూరు, ఆకులేడు గ్రామాల్లో వైసీపీ అభ్యర్థి ఎం.వీరాంజనేయులు, ఎంపీ అభ్యర్థి శంకర్ నారాయణ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో లోలూరు పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ అంజన్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు.

గుత్తిలో...


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న వలంటీర్లు (వృత్తాల్లో..)

పట్టణంలో వైసీపీ చేపట్టిన ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలను తుంగలో తొక్కి పాల్గొన్న వలంటీర్లు. పట్టణంలోని కోటవీధిలోని 12, 13 వార్డులలో వైసీపీ నాయకులు సోమవారం ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆయా వార్డులకు చెందిన వలంటీర్లు దివాకర్, మహ్మద్‌నవీద్, నాసీర్‌హుసేన్ పాల్గొన్నారు.

బొమ్మనహాళ్‌లో...

మండలంలో కొందరు వలంటీర్లు నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూనే ఉన్నారు. హొసళ్లి, వన్నళ్లి, దర్గాహోన్నూరు గ్రా మాలలో సోమవారం రాయదుర్గం వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి తనయుడు మెట్టు విశ్వనాథరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట స్థానిక వలంటీర్లు హనుమంత, అజయ్, బడిగె వన్నూరుస్వామి, వన్నూరుస్వామి, భాస్కర్, నాగరాజు, వన్నేశ్, వలంటీర్ భర్త సంతోష్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అలాగే స్టోర్ డీలర్ ఎర్రిస్వామి మరికొందరు వలంటీర్లు ఇంటింటికి తిరుగుతూ మెట్టు గోవిందరెడ్డికి సంబంధించిన స్టిక్కర్లను అతికించారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు (వృత్తాల్లో..)

కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, వలంటీర్ సస్పెన్షన్

శింగనమల: నియోజకవర్గంలోని వైసీపీ అభ్యర్థి వీరాంజినేయులు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ వలంటీర్‌ను సస్పెండ్ చేసినట్లు ఆర్వో శ్రీను వెన్నెల తెలిపారు. వైసీపీ ప్రచారంలో నార్పలకు చెందిన డొక్క కృష్ణ, శింగనమల మండలం రాచేపల్లి పంచాయతీ కార్యదర్శి బీఎల్‌వోగా పనిచేస్తున్నాడు. నార్పలలో వైసీపీ ప్రచారంలో పాల్గొన్నాడు. వెస్టు నరసాపురానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ పట్నం భాస్కర్ పూట్లూరులో వైసీపీ ప్రచారంలో పాల్గొన్నారు. చిన్న జలాలపురానికి చెందిన వలంటీర్ ఎం.వెంకటేశ్ శింగనమలలో జరిగిన వైసీపీ సన్మానంలో పాల్గొన్నారు. ఇందుకు సంబంధించిన కథనాలు ఆంధ్రజ్యోతిలో రావడంతో అధికారులు వీరిని సస్పెండ్ చేశారు.

వలంటీర్ల తొలగింపు

తనకల్లు: మండలంలోని రాచినేపల్లికి చెందిన వలంటీర్లు మనోహర్‌నాయుడు, శ్రీహరినాయుడులను విధులనుంచి తొలగించినట్లు ఎంపీడీఓ పూల నరసింహులు తెలిపారు. సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో వైసీపీ ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు అన్న కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఆయనవారిని విధులనుంచి తొలగించినట్లు తెలిపారు.

యానిమేటర్ ఔట్

అనంతపురం క్లాక్‌టవర్: వైసీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న యానిమేటర్ నాగరాజును విధుల నుంచి తొలగించారు. బొమ్మనహాళ్ మండలం హరేసముద్రం శారద గ్రామైక్య సమాఖ్యలో యానిమేటర్ (వీఓఏ)గా పనిచేస్తున్నారు. ఈనెల 18వ తేదీన వైసీపీకి అనుకూలంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. విచారణ చేసిన అనంతరం యానిమేటర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు నిర్ధారించుకున్న అనంతరం విధుల నుంచి తొలగించినట్లు డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ నరసింహారెడ్డి తెలిపారు.

ప్రచారంలో పాల్గొనేదే: ఎండీయూ ఆపరేటర్లు


వైసీపీ నాయకుల సన్మానంలో పాల్గొన్న ఎండీయూ ఆపరేటర్లు అంజిల్‌రెడ్డి, లోకనాథ్ (వృత్తంలో ఉన్న వ్యక్తులు)

శింగనమల, మార్చి 25: మా ఉద్యోగాలు పోయినా వైసీపీ ప్రచారంలో పాల్గొంటామని ఎండీయూ ఆపరేటర్లు అంటున్నారు. వైసీపీ మండల కన్వీనర్‌గా నూతనంగా నియమితుడైన చిక్కాల బాలకృష్ణ సన్మాన కార్యాక్రమంలో జూలాకాలువ, చక్రాయపేట ఎండీయూ ఆపరేటర్లు అంజిల్‌రెడ్డి, లోకనాథ్ పాల్గొన్నట్లు ఆలస్యంగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన ఘటనపై ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.


ఎండీయూ ఆపరేటరే వైసీపీ మండల కన్వీనర్


వైసీపీ మండల కన్వీనర్ (వృత్తంలో..)

శింగనమల: ఎన్నికల ముందు ఓటర్ల కోసం సోదనపల్లి గ్రామానికి చెందిన చిక్కాల బాలకృష్ణను వైసీపీ మండల కన్వీనర్‌గా నియమించారు. ఆయన రాచేపల్లి ఎండీయూ ఆపరేటర్‌గా ఉండి వైసీపీ ప్రచారంలో పాల్గొంటున్నాడు. విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదు. బాలకృష్ణ ఆపరేటర్ పదవికి రాజీనామా చేయకుండా ఎన్నికల కోడ్ అతిక్రమించి ప్రచారంలో పాల్గొంటున్నాడు. ఇప్పటికైనా ఆయనపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

రెండు నెలలు సెలవివ్వండి.. ప్రచారంలో పాల్గొంటాం

- ఎండీయూ ఆపరేటర్లు, డీలర్ల వినతి.. ఖంగుతిన్న అధికారులు


డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

శింగనమల: సార్ తాము వైసీపీ తరుపున ప్రచారం చేస్తాం... మాకు రెండు నెలలు సెలవులు ఇవ్వండి అంటూ ఎన్నికల సమావేశంలో కొందరు ఎండీయూ ఆపరేటర్లు, స్టోరు డీలర్లు అధికారులకు విన్నవించడంతో, అధికారులు ఖంగుతిన్నారు. సోమవారం ఎన్నికల నిబంధనలపై తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.. తహసీల్దార్ శోభన్‌బాబు, సీఐ శ్రీధర్ మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే తొలగిస్తామని హెచ్చరించారు. అంతలోనే కొందరు ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లు స్పందిస్తూ వైసీపీ మాకు భిక్ష పెట్టింది, ఆపార్టీ కోసం రెండు నెలలు సెలవు ఇవ్వాలని, ప్రచారంలో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని కోరారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ మొదట రాజీనామాలు చేసి ప్రచారంలో పాల్గొనవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ రాజశేఖర్, ఎన్నికల సిబ్బంది ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్యానికి.. వైసీపీ పాతర..!



- ఐదేళ్లలో డ్రిప్, స్ప్రింక్లర్ల సరఫరాపై నిర్లక్ష్యం
- వేలాది మంది రైతులకు మొండిచేయి
- టీడీపీ హయాంలో 90 శాతం సబ్సిడీతో సరఫరా

అనంతపురం అర్బన్, మార్చి 25: తవైసీపీ పాలకులు కరువు జిల్లాలో సూక్ష్మసేద్యానికి పాతరేశారు. గత ఐదేళ్ల పాలనలో రెండేళ్లు డ్రిప్, స్ప్రింకర్ల సరఫరాను పూర్తిగా బంద్ చేశారు. రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో సబ్సిడీని కుదించి అరకొరగా పరికరాలు సరఫరా చేయడంతో ప్రభుత్వం సరిపెట్టింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలు కాకముందే ఈ ఏడాది జనవరి నుంచే సూక్ష్మసేద్య పరికరాల సరఫరాను ఆపేసింది. దీంతో అరటి, ఇతర రకాల ఉద్యాన పంటలు సాగు చేసేందుకు సిద్ధమైన రైతులకు నిరాశే మిగిలింది. టీడీపీ హయాంలో 2014-15 నుంచి 2018-19 దాకా ఉమ్మడి జిల్లాలోని 1,07,751 మంది రైతులకు 1,22,864.24 హెక్టార్లల్లో సూక్ష్మసేద్యం పరికరాలు సరఫరా చేశారు. వైసీపీ పాలనలో కేవలం 54,951 మంది రైతులకు 67,659.48 హెక్టార్లల్లో పరికరాలు సరఫరా చేయడంతో సరిపెట్టారు.

వైసీపీ పాలనలో సరఫరా ఇలా...

సంవత్సరం	రైతుల సంఖ్య	డ్రిప్, స్ప్రింకర్ల సరఫరా (హెక్టార్లల్లో)
2019-20	19,276	24,770.72
2020-21	-	-
2021-22	-	-
2022-23	19,045	22,883.45
2023-24	16,630	20,005.31
మొత్తం	54,951	67,659.48

ఐదేళ్లల్లో పూర్తి నిర్లక్ష్యం

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి అనంత జిల్లా రైతులకు డ్రిప్, స్ప్రింకర్ల సరఫరాలో నిర్లక్ష్యం వహించారు. 2019-20 సంవత్సరంలో కేవలం 19,276 మంది రైతులకు 24,770.72 హెక్టార్లల్లో పరికరాలు సరఫరా చేయడంతో సరిపెట్టారు. ఆ తర్వాత 2020-21, 2021-22 రెండు సంవత్సరాల్లో పరికరాల సరఫరాను పూర్తిగా బంద్ చేశారు. ఈ పరిస్థితుల్లో వేలాది మంది రైతులు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు డ్రిప్, స్ప్రింకర్లను కొనుగోలు చేయాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నారు. తిరిగి 2023-24 సంవత్సరంలో పరికరాలు సరఫరాను తిరిగి మొదలు పెట్టినా పెద్దగా ప్రయోజనం కనిపించలేదు. వైసీపీ పాలనలో వేలాది మంది రైతులకు మొండిచేయి చూపారు.

సబ్సిడీ కుదింపుతో తీరని అన్యాయం

టీడీపీ హయాంలో ఉమ్మడి అనంత జిల్లాలో సూక్ష్మసేద్యం పరికరాలకు పదెకరాల దాకా 90 శాతం సబ్సిడీ వర్తింపజేశారు. ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం ఉచితంగా డ్రిప్ పరికరాలు సరఫరా చేసేవారు. వైసీపీ అధికారంలోకి రాగానే సూక్ష్మసేద్య పరికరాల మంజూరుకు సంబంధించి గైడ్ లైన్స్‌ను మార్చింది. ఐదెకరాల దాకా 90 శాతం, ఆపైన 70 శాతం సబ్సిడీని వర్తింపజేశారు. ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం ఉచిత సబ్సిడీ ఎత్తేశారు. ఇతర కేటగిరిల రైతుల తరహాలోనే సబ్సిడీ పోను మిగతా డబ్బులు చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ రైతులకు షరతు పెట్టారు. బిందు సేద్యం ద్వారా పంటలు సాగు చేయడంపై మక్కువ పెంచుకున్న రైతులు డ్రిప్ కోసం ప్రభుత్వం విధించిన లక్ష్యం కంటే ఎక్కువ సంఖ్యలోనే రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో రైతులకు పరికరాలు సరఫరా చేయకుండా చేతులెత్తేశారు.

టీడీపీ హయాంలో ఉమ్మడి అనంత జిల్లాలో డ్రిప్, స్ప్రింక్లర్ల సరఫరాఇలా..

సంవత్సరం	రైతుల సంఖ్య	డ్రిప్, స్ప్రింకర్ల సరఫరా (హెక్టార్లల్లో)
2014-15	7,726	8,355.42
2015-16	21,157	21,687.01
2016-17	22,181	24,637.40
2017-18	29,720	34,814.49
2018-19	26,967	33,369.92
మొత్తం	1,07,751	1,22,864.24

ఎన్నిసార్లు అడిగినా ప్రయోజనం లేదు



మూడెకరాల్లో అరటి పంట సాగు చేసేందుకు డ్రిప్ పరికరాల కోసం ఏడాది క్రితం దరఖాస్తు చేసుకున్నా. ఆర్బీకేలో దరఖాస్తు చేసుకున్నా నాతో డీడీ కట్టించుకోలేదు. డ్రిప్ పరికరాలు సరిగా సరఫరా కావడం లేదని, రాగానే డీడీ కట్టించుకుంటామని అధికారులు చెప్పారు. ఎన్ని సార్లు అధికారుల వద్దకు వెళ్లి అడిగినా ప్రయోజనం లేకుండాపోయింది. బయట మార్కెట్‌లో డ్రిప్ పరికరాలు కొనలేక అరటి పంట సాగు చేయలేకపోయా.

- నారప్ప, రైతు, నార్పల మండలం

రెండేళ్లు ఎదురుచూసినా..



రెండేళ్ల క్రితం డ్రిప్ పరికరాల కోసం దరఖాస్తు చేశా. రెండేళ్లుగా ఎదురుచూసినా ఇప్పటి దాకా పరికరాలు సరఫరా చేయలేదు. అధికారులను అనేక సార్లు అడిగినా అదిగో.. ఇదిగో అంటూ చెప్పుకొచ్చారు. టీడీపీ హయాంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే అధికారులు స్పందించి డీడీ కట్టించుకొని, సకాలంలో డ్రిప్ పరికరాలు సరఫరా చేసేవారు. వైసీపీ పాలనలో రైతులకు డ్రిప్ పరికరాలు సరఫరా చేయకపోవడం బాధాకరం.

- సాదిక్ వలి, రైతు, శింగనమల మండలం

కుటాలపల్లిలో కలకలం

- హత్యతో ఉలికిపాటు
- ఘటనపై పలు అనుమానాలు


అమరనాథ్‌రెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

నల్లమాడ, మార్చి 25: మండలంలోని కుటాలపల్లిలో టీడీపీ నాయకుడు డి.అమరనాథ్ రెడ్డి(42) హత్య కలకలం రేపింది. హత్యతో ఊరిజనం ఉలికిపడ్డారు. హత్యపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అమరనాథ్‌రెడ్డి వ్యవసాయం చేస్తుండేవాడు. సొంత పొలంతోపాటు కొంత కౌలుకు తీసుకుని, పంటలు సాగు చేసేవాడు. పొలం వద్ద పాడి పశువులను పెంచుతున్నారు. ఎప్పటిలాగే ఆదివారం రాత్రి పాల క్యాన్లు తీసుకుని పొలం వద్దకెళ్లాడు. పాలు తీసుకుని సోమవారం ఉదయం ఇంటికి రావలసిన అతడు రాలేదు. భార్య సుధమ్మ ఫోన్ చేసినా స్పందనలేదు. అనుమానం వచ్చి, పొలం వద్దకెళ్లగా అమరనాథ్ రెడ్డి రక్తపు మడుగులో పడివున్నాడు. భర్త శవాన్ని చూసి సుధమ్మ సొమ్మసిల్లి పడిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సుధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అమరనాథ్‌రెడ్డికి కుమారుడు, కూతురు ఉన్నారు.


అమరనాథ్‌రెడ్డి (ఫైల్)

డాగ్ స్క్వాడ్‌తో పరిశీలన...

హంతకుల ఆచూకీని కనుగొనేందుకు పోలీసులు అనంతపురం నుంచి డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. హత్య ప్రాంతం నుంచి పోలీసు జాగిలం.. ఒక్కటిన్నర కిలోమీటరు దూరంలో ఉన్న కుటాలపల్లికి వచ్చింది. గ్రామ నడిబొడ్డున ఉన్న అమరనాథ్‌రెడ్డి ఇంటికెళ్లింది. ఇంట్లో సంచరించిన అనంతరం తిరిగి హత్యా స్థలానికి చేరుకుంది.

వ్యక్తిగత కారణల వల్లే హత్య: ఎస్పీ

వ్యక్తిగత కారణాలతోనే అమరనాథ్‌రెడ్డి హత్య జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించామని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. డీఎస్పీ వాసుదేవన్‌తో కలిసి ఆయన హత్యాస్థలాన్ని పరిశీలించారు. హత్య వెనుక ఎటువంటి రాజకీయ కోణం లేదనీ, వ్యక్తిగత కారణాలతోనే హత్య జరిగి ఉండవచ్చని అన్నారు. దర్యాప్తు చేసి, వాస్తవాలను వెల్లడిస్తామన్నారు. హత్య కేసును వెంటనే ఛేదించాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు.

అండగా ఉంటాం: పల్లె

అమరనాథ్ రెడ్డి హత్య గురించి తెలియగానే మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కుటాలపల్లికి వెళ్లారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి, వివరాలు తెలుసుకున్నారు. పార్టీ, తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఎస్పీ మాధవరెడ్డితో చర్చించారు. హత్య చేసినవారిని వెంటనే గుర్తించి, అరెస్టు చేయాలని కోరారు.

రాజకీయ కోణం ఉందా..?

అమరనాథరెడ్డి టీడీపీలో చురుకైన నాయకుడు. చాలా కాలం నుంచి పార్టీలో ఉన్నారు. ఆదివారం సాయంత్రం కూడా ప్రచారానికి వెళ్లి వచ్చారు. దీంతో ఆయన హత్య వెనుక రాజకీయ కోణం ఉందా అన్న చర్చ సాగుతోంది. టీడీపీ నాయకుడి హత్యతో మండల ప్రజలు భయాందోళనలకు లోనవుతున్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ నాయకుడు హత్యకు గురికావడంతో రాజకీయ కారణాలతోనే హత్య చేసి ఉంటారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు మాత్రం వ్యక్తిగత కారణాలతోనే హత్య జరిగి ఉంటుందని భావిస్తున్నారు. తమకు ఎవరితోనూ వ్యక్తిగత తగాదాలు లేవనీ, ఆస్తి గొడవలు కూడా లేవని బాధిత కుటుంబం అంటోంది.


విలపిస్తున్న అమరనాథ్ రెడ్డి భార్య

బెంగళూరు రోడ్డు ప్రమాదంలో
అనంత సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దుర్మరణం


మణికంఠ (ఫైల్)

దొమ్మసంద్ర, మార్చి 25: అనంతపురం నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ జయం మణికంఠ (24) బెంగళూరులోని సర్జాపుర రోడ్డులో జరిగిన ప్రమాదంలో దుర్మరణం చెందాడు. సర్జాపుర రోడ్డులోని డిమార్ట్ సమీపాన ఆదివారం ద్విచక్రవాహనంలో వెళ్తుండగా వేగంగా దూసుకొచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో మణికంఠ తీవ్రరక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. అతడు బెంగళూరులోని ఎంయూ సిగ్మా కంపెనీలో పనిచేస్తుండేవాడు. అత్తిబెలె ఆక్స్‌ఫర్డ్ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. సర్జాపుర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని సర్జాపుర సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్ తెలిపారు. స్పీడ్ బ్రేకర్ వద్ద ప్రమాదం జరిగిందని, సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని వివరించారు. మణికంఠ తండ్రి జయం కృష్ణమోహన్ ఆంధ్రజ్యోతి అనంతపురం యూనిట్‌లో పనిచేస్తున్నారు. కృష్ణమోహన్, అరుణ దంపతులకు మణికంఠ ఏకైక సంతానం. చేతికి వచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. వారి కుటుంబ సభ్యులను ఆంధ్రజ్యోతి సిబ్బంది పరామర్శించారు. సోమవారం మధ్యాహ్నం మణికంఠ అంత్యక్రియలు పూర్తిచేశారు.

మోటార్లకు మీటర్ల ఏర్పాటును అడ్డుకున్న రైతులు

- మద్దతు తెలిపిన టీడీపీ, సీపీఎం, రైతు సంఘం


మీటర్లు బిగించే కార్యక్రమాన్ని అడుకుంటున్న రైతులు, వివిధ పార్టీల నాయకులు

తనకల్లు, మార్చి 25: మండలంలోని వంకపల్లి గ్రామంలో సోమవారం ఉదయం గుట్టుచప్పుడు కాకుండా విద్యుత్ మోటార్లకు మీటర్లు అమర్చే కార్యక్రమాన్ని షిర్డి సాయి ఎలక్ట్రికల్స్ సంస్థ చేపట్టింది. రైతులకు తెలియకుండా ఏడు విద్యుత్ బోర్లకు మీటర్లను బిగించారు. విషయం తెలుసుకున్న వంకపల్లి గ్రామస్థులు, రైతులు, టీడీపీ, సీపీఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో మీటర్లు బిగించే కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. కోటూరు, పరాకువాండ్లపల్లి, వంకపల్లి, నల్లచెరువు మండలంలోని బోనేపల్లి గ్రామాలనుంచి రైతులు పెద్దఎత్తున వంకపల్లి వద్ద మోటార్లకు మీటర్లు బిగిస్తున్న ప్రాంతానికి వచ్చి అడ్డుకున్నారు. బిగించిన మీటర్లు వెంటనే తొలగించాలని, లేదంటే ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. అక్కడే ఉన్న విద్యుత్ లైన్‌మన్, గ్రామస్థులు విషయాన్ని ట్రాన్స్‌కో ఏఈ శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆందోళన అధికంగా కావడంతో బిగించిన మీటర్లను తొలగించి, వెనక్కి వెళ్లిపోయారు. కార్యక్రమంలో టీడీపీ గుడిపల్లి రెడ్డెప్పరెడ్డి, చిన్నప్ప, దస్తగిరి, సీపీఎం శివన్న, సీఐటీయూ ఒంటెద్దు వేమన్న, రైతు సంఘం రమణ, వెంకటరమణ, రైతులు క్రిష్ణారెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణరెడ్డి, శేఖరప్ప, వెంకటరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కొడికొండ చెక్‌పోస్టులో భారీగా బంగారు, వెండి పట్టివేత

చిలమత్తూరు, మార్చి 25: బెంగళూరు నుంచి బళ్లారికి తీసుకెళుతున్న పెద్ద మొత్తంలోని బంగారు, వెండి ఆభరణాలను పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని 44వ జాతీయ రహదారిపై కొడికొండ చెక్‌పోస్టులో ప్రత్యేక పోలీసులు సోమవారం వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో ఓ ప్రత్యేక వాహనంలో తీసుకెళుతున్న బంగారు, వెండి ఆభరణాలు పట్టుబడినట్లు తెలిసింది. వాటికి సంబంధించి సరైన వేబిల్లులు లేకపోవడంతో పట్టుబడిన ఆభరణాలతో పాటు వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన వస్తువుల విలువ సుమారు. రూ.8 కోట్ల వరకు ఉంటుందని సమాచారం. అయితే దీనిపై పోలీసులు వివరాలు వెల్లడించడానికి నిరాకరించారు. పట్టుబడిన బంగారు, వెండి పెద్ద మొత్తంలో ఉండటంతో వాటిని ఆదాయ పన్నుల శాఖ, వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఇంత పెద్ద మొత్తంలో పట్టుబడిన బంగారు, వెండి ఆభరణాలను జిల్లా ట్రెజరీలోనే భద్రపరచాల్సి ఉంది. అయితే రవాణా చేస్తున్న బంగారు, వెండి వస్తువులను హైదరాబాదు నుంచి బళ్లారికి తీసుకెళుతున్నట్లుగా వేబిల్లులు ఉండగా, వాటిని బెంగళూరు నుంచి బళ్లారికి తీసుకెళుతున్నట్లు విశ్వసనీయ సమాచారం ద్వారా తెలిసింది.


బంగారాన్ని తరలిస్తున్న వాహనం ఇదే..

మామపై దాడి కేసులో అల్లుడికి జైలు శిక్ష

బుక్కపట్నం, మార్చి 25: మామపై దాడిచేసి గాయపరచిన అల్లుడికి ఆరునెలలు జైలు శిక్షతోపాటు రూ.1000 జరిమానా విధిస్తూ పుట్టపర్తి జేఎఫ్‌సీఎం కోర్టు తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ సురేష్‌బాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన శీనుకు అదే ఊరికి చెందిన వరలక్ష్మితో వివాహమైంది. 2013లో శీనుతో గొడవపడి భార్య పుట్టింటికి వెళ్లింది. తరువాత భార్య ఇంటికెళ్లి శీను.. మామ నారాయణతో గొడవపడ్డాడు. తన భార్యను ఇంటికి పంపాలని అడిగాడు. ఈ నేపథ్యంలో మామను కట్టెతో కొట్టడంతో అతడి కాలు విరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసుకుని, నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. దీనిపై విచారించిన జేఎఫ్‌సీఎం కోర్టు శీనుకు ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది.

ఎన్ఎంఆర్ ఉద్యోగిపై ఫిర్యాదు

తాడిపత్రి టౌన్, మార్చి 25: మున్సిపల్ కార్యాలయంలో ఎన్ఎంఆర్‌గా పనిచేస్తున్న జేసీ సూర్యనారాయణరెడ్డిపై సోమవారం ఎన్నికల అధికారి, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ రాంమోహన్‌కు టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఈ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఎన్ఎంఆర్ జేసీ సూర్యనారాయణరెడ్డి మున్సిపల్ ఉద్యోగిగా పని చేస్తూ వైసీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి వెంట ఎన్నికల ప్రచారంతోపాటు ప్రతి కార్యక్రమానికి హాజరవుతూ.. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించాడన్న దానిపై జేసీపీఆర్ ఫిర్యాదు చేశారు.


ఎమ్మెల్యే పెద్దారెడ్డితో ఎన్ఎంఆర్ జేసీ సూర్యనారాయణరెడ్డి

సీపీఎస్ రద్దుకు సహకరించాలి

- యూటీఎఫ్ నాయకుల డిమాండ్


జీపీఎస్ అవగాహన కరపత్రాలను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ధర్మవరం, మార్చి 25: రాష్ట్రంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం(సీపీఎస్) రద్దుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని యూటీఎఫ్ సత్యసాయిజిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, కార్యదర్శి సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ... రెండు దశాబ్దాల కాలంలో యూటీఎఫ్ స్వతంత్రంగా ఉద్యోగ, ఉపాధ్యాయసంఘాల కార్యాచరణలోనూ మండల స్థాయి నుంచి ఢిల్లీస్థాయి వరకూ అనేక పోరాటాలు చేస్తోందన్నారు. సార్వత్రిక ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు, ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా స్పందించి సీపీఎ స్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించే విధంగా పునఃసమీక్షించాలని వారు కోరారు. రంజాన్ మాసంలో ముస్లిం ఉపాధ్యాయులకు 10వ తరగతి స్పాట్ వాల్యూయేషన్ సమయంలో సౌకర్యాలు కల్పించాలన్నారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న, కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు తహీర్‌వలి, శివశంకర్, లక్ష్మీనారాయణ, జీసీ నరేశ్, ఆడిట్ కమిటీ సభ్యుడు ఆజంబాషా పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

● ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి అభ్యర్థన ● గ్రామగ్రామాన ఘన స్వాగతం

కొత్తచెరువు, మార్చి 25: వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపించాలని, నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి ప్రజల్ని అభ్యర్థించారు. మండలంలోని కేశాపురం, కొడపగానిపల్లి పంచాయతీల్లో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారాన్ని భర్త పల్లె వెంకట కృష్ణ కిశోర్‌రెడ్డితో కలిసి నిర్వహించారు. ఆయా గ్రామాలకు చేరుకోగానే స్థానిక టీడీపీ నాయకులతో పాటు గ్రామస్థులు పూల వర్షం కురిపిస్తూ.. హారతులు పడుతూ ఘన స్వాగతం పలికారు. ఆమె ఇంటింటికీ తిరిగి ప్రచారం చేపట్టారు. సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు కరపత్రాలు పంచుతూ వివరించారు. ముఖ్యంగా మహిళలకు ప్రతినెలా రూ.1500, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, కుటుంబానికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, చదువుకునే పిల్లలకు ఏడాదికి రూ. 15 వేలు, రైతులకు పెట్టుబడి సాయం తదితర పథకాలను అందజేయనున్నట్లు తెలిపారు. చంద్రబాబు సీఎం కాగానే ఆ పథకాలన్నీ అమలవుతాయన్నారు. అలాగే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు కియ కార్ల పరిశ్రమను తీసుకొచ్చి వేలాది మందికి ఉద్యోగాలు కల్పించిన ఘనత చంద్రబాబుదే అని గుర్తు చేశారు. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. మళ్లీ రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే చంద్రబాబు సీఎం కావాలని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపించాలని నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని సింధూర పేర్కొన్నారు. కార్యక్రమం లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కేశాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న పల్లె సింధూరా రెడ్డి



పల్లె సమక్షంలో టీడీపీలోకి చేరుతున్న వైసీపీ కుటుంబాలు

టీడీపీలోకి 30 కుటుంబాలు చేరిక

● కండువాలు వేసి ఆహ్వానించిన మాజీమంత్రి పల్లె

కొత్తచెరువు, మార్చి 25: మండల కేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నివాసం ఉంటున్న సుమారు 30 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. నాయకుడు కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి సమక్షంలో వారు తెలుగుదేశంలోకి చేరారు. పల్లె వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి తెలిపి.. టీడీపీ అధికారంలోకి వస్తే ఆ పథకాలన్నీ అమలవుతాయని తెలిపారు. వాటి వల్ల అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.4లక్షల మేర లబ్ధి చేకూరుతుందని వివరించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రావాలంటే చంద్రబాబు సీఎం కావాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ అడపాల రామకృష్ణ, నాయకులు బీడిపల్లి సుబ్బరాయుడు, బండ్లపల్లిరాజు, గాజులచంద్ర, టైలర్ కొండ, సుధీర్, సుబ్రహ్మణ్యం, జనసేన నాయకులు పూలశివ, నరేంద్రభూపతి, మధు, గాజులనాగేంద్ర, హరి, చంద్ర, బాలబొజ్జప్ప, బాలావెంకటేశ్, నంజమ్మ, అనిత, భారతి పాల్గొన్నారు

కూటమిని గెలిపించండి

పుట్టపర్తి రూరల్: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిని అఖండ మెజారిటీతో గెలిపించాలని మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి ప్రజల్ని కోరారు. మండలంలోని బొంతలపల్లి, కంబాలపర్తి గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో పల్లె సింధూరారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పట్టాదారు పాసుపుస్తకం ఉన్న ప్రతి రైతుకు రూ.20వేల పంటసాయం ప్రతిఏటా అందచేస్తామని, నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపిస్తామని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అనేక మంది రైతులు అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకున్నార న్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఐదేళ్లలో దోపిడీ తప్ప అభివృద్ధి చేయలేదన్నారు. పల్లె సింధూరారెడ్డిని గెలిపించి.. శ్రీధర్‌రెడ్డిని ఇంటికి పంపుదామని పిలుపునిచ్చారు. సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బొంతలపల్లి సర్పంచు శ్రీనివాసులు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్తి చంద్రశేఖర్, టీడీపీ మండలకన్వీనర్ విజయ్‌కుమార్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శ్రీరామరెడ్డి, నాయకులు కృష్ణ, బాబు, బొమ్మయ్య, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి జయంత్యుత్సవాలు

ధర్మవరం, మార్చి 25: పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో సోమవారం అర్చకులు మహాలక్ష్మి అమ్మవారి జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే పూజలు, అర్చనలు చేశారు. అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పొరాళ్ల పుల్లయ్య శిష్యబృందంతో కలిసి మహాలక్ష్మి కీర్తనలు ఆలపించారు. అమ్మవారి జయంతి ఉత్సవాలను నిర్వహించిన వారికి అన్ని కష్టాలు తొలగి సుఖవంతమైన జీవితం లభిస్తుందని అర్చకులు తెలిపారు.



ప్రత్యేకాలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు

వైభవంగా కాటమయ్యస్వామి ఉత్సవాలు

● భక్తుల నడుమ లంకాదహనం

బత్తలపల్లి మార్చి 25: మండలంలోని సంజీవపురం కాటమయ్య స్వామి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం రాత్రి స్థానిక కొండ వద్ద భక్తుల నడుమ లంకాదహనం జరిగింది. తొలుత మండలంలోని ముష్టూరుకు చెందిన కరణం కుటుంబీకులు ఊరేగింపుగా రెడ్డి వారి ఇంటికి వెళ్లి అక్కడ తేనేటి విందు స్వీకరించారు. అనంతరం ఇరు కుటుంబాల వారు కలిసి ఊరేగింపుగా కొండ వద్దకు చేరుకుని స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఉత్సవమూర్తిని పురవీధుల్లో ఊరేగించారు. తర్వాత లంకాదహనం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున బాణసంచా కాల్చి లంకాదహనం జరిపారు. కార్యక్రమం చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేకాలంకరణలో కాటమయ్యస్వామి

ఘనంగా హోలీ

ఓబుళదేవరచెరువు, మార్చి 25: మండల వ్యాప్తంగా సోమవారం హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కులమతాలకతీతంగా ప్రతిఒక్కరూ ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. మండలకేంద్రంతో పాటు నాయనకోటతండా, నవాబుకోటతండా, శేషయ్యపల్లి, తిప్పేపల్లితండా తదితర ప్రాంతాల్లో హోలీని ఘనంగా జరుపుకున్నారు.

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా పలు తండాల్లో హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. తుమ్మలబైలు పెద్దతండా, సీఎంతండా, పచ్చార్లతండా, నల్లగుట్టతండా, సున్నపుగుట్టతండా, బనాన్‌చెరువు పల్లి తండా తదితర ప్రాంతాల్లో హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అందరూ బంధుమిత్రులతో రంగులు చల్లుకుని, విందుభోజనాలు చేసి ఆనందంగా పండుగ చేసుకున్నారు.

ఆర్మీ మద్యంబాటిళ్లు స్వాధీనం

ధర్మవరం, మార్చి 25: పట్టణంలో శాంతినగర్‌లోని ఓ ఇంటిలో నిల్వ ఉన్న 12 ఆర్మీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐలు గురుప్రసాద్, రాజన్న తెలిపారు. పుట్టపర్తి అడిషనల్ ఎస్పీ నాగభూషణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం ఆదేశాల మేరకు శాంతినగర్‌లో పలు ఇళ్లలో దాడులు చేశామన్నారు. అందులో బత్తలశ్రీనివాసులు ఇంటిలో 12 ఆర్మీ మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం అతన్ని అరెస్టు చేశామన్నారు. దాడుల్లో సెబ్ సిబ్బంది గిరీశ్‌కుమార్, మల్లికార్జున, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న సెబ్ అధికారులు

అలరించిన ప్రేమభక్తి పర్వం

పుట్టపర్తి, మార్చి 25: బీహార్ బాల వికాస్ విద్యార్థులు చేపట్టిన ప్రేమ భక్తి పర్వం నాటిక భక్తులను అలరించింది. పట్టణంలోని ప్రశాంతి నిలయంలో గల సాయికుల్వంత్ హాల్లో సోమవారం సాయంత్రం బీహార్ భక్తులు హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాలవికాస్ విద్యార్థులు మార్కండేయ పురాణంలోని ప్రహ్లాదుడి భక్తిని చాటుతూ అందులోని ఘట్టాలను నాటిక రూపంలో అద్భుతంగా ప్రదర్శించారు. అలాగే చిన్నారులు తమ నృత్యంతో భక్తులను మైమరపించారు. అనంతరం సత్యసాయి అష్టోత్తర శతనామపఠనం చేశారు. తదుపరి సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.వేడుకల్లో ఆ రాష్ట్రానికి చెందిన వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.



నాటిక ప్రదర్శిస్తున్న బీహార్ బాలవికాస్ విద్యార్థులు





నృత్యంతో అలరిస్తున్న చిన్నారులు, చిన్నారి ప్రదర్శన

భూముల అన్యాక్రాంతంపై విచారణ చేయండి

● పోలీసులను కోరిన బాధిత రైతులు

పుట్టపర్తి రూరల్, మార్చి 25: భూముల అన్యాక్రాంతంపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని, అన్యాక్రాంతం చేసిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేయాలని రైతులు కోరారు. మండలంలోని కప్పలబండ, జగరాజుపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు తమకు వారసత్వంగా వచ్చిన భూములను అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకుని ఆక్రమించడానికి ప్రయత్నించిన వారిపై ఫిర్యాదు చేయడానికి సోమవారం పుట్టపర్తి రూరల్ పోలీసుస్టేషన్‌కు వచ్చారు. కేసు నమోదు చేయాలని కోరగా ఇది సివిల్ అంశమని, జిల్లా లేదా మండల రెవెన్యూ పరిధిలోకి వస్తుందని, భూములు అన్యాక్రాంతం అయినదీ.. లేనిది రెవెన్యూ వారు తేల్చాలని పోలీసులు తెలిపారు. ఆ తర్వాత తాము రంగంలోకి దిగుతామని రైతులకు సూచించారు. దీంతో రైతులు నారాయణప్ప, నరసమ్మ, ఉమామహేశ్వరరావు, గజేంద్ర, గంగాద్రి, ప్రశాంత్ తదితరులు మాట్లాడుతూ.. తమ భూములను అధికారులు సమాచారం ఇవ్వకుండా తిమ్మరాజుపేరున ఆన్‌లైన్ ఎలా చేస్తారంటూ ప్రశ్నించారు. సర్వేనెంబరు 35లో 24.70 ఎకరాలు ఉండగా.. అధికారులు ఆన్‌లైన్‌లో 28.29 ఎకరాలుగా నమోదు చేశారన్నారు. ఎఫ్ఎంబీలో 24.70 ఎకరాలుంటే ఆన్‌లైన్‌లో అదనంగా 3.59 ఎకరాలు చేర్చి 28.29 ఎకరాలుగా చూపడమేంటని, భూమిలేకపోయినా భూమిఉన్నట్లు చూపడం ఎవరిని మోసం చేయడానికని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో భూమి తమపేరున ఉందని దళారులు రంగప్రవేశం చేసి ఆక్రమించే వరకు తమ భూములు అన్యాక్రాంతం అయ్యాయని వాపోయారు. భూఆక్రమాలకు పాల్పడిన వారిపై న్యాయపోరాటానికి వెనుకాడమని రైతులు హెచ్చరించారు.



భూహక్కు పత్రాలను చూపుతున్న రైతులు

ఎన్నికల కోడ్‌పై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కృష్ణవేణి

గాండ్లపెంట, మార్చి 25: మండలంలోని తూపల్లి పంచాయతీ కటకంవారిపల్లిలో ఎన్నికల నిబంధనలపై ప్రజలకు సోమవారం ఎస్ఐ కృష్ణవేణి అవగాహన కల్పించారు. ఎన్నికల దృష్ట్యా కోడ్ అమలులో ఉండడంతో నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ఎవరూ అల్లర్లు, గొడవలకు పాల్పడకూడదని తెలిపారు. ఓటర్లను ఎవరైనా ప్రలోభపెడితే తమ దృష్టికి తేవాలని సూచించారు. ఆమె పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కొత్తచెరువులో పోలీసుల కవాతు

కొత్తచెరువు, మార్చి 25: మండలకేంద్రంలో సోమవారం సాయంత్రం సీఐ రాజారమేశ్ ఆధ్వర్యంలో ఎస్ఐ సురేశ్ బాబు, సిబ్బంది, బీఎస్ఎఫ్ బలగాలతో కలిసి కవాతును నిర్వహించారు. నాలుగురోడ్ల కూడలిలో కవాతు చేపట్టారు. అనంతరం సీఐ మాట్లాడుతూ... సార్వత్రిక ఎన్నికలలో ఓటర్లు ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పోలీసు బలగాలను రప్పించడం జరిగిందన్నారు. సమస్యాత్మకమైన ప్రాంతాలలో బీఎస్ఎఫ్ బలగాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైన ఎన్నికలకు ఆటంకం కల్గిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

హోరెత్తిన గోవిందనామ స్మరణ



జనసంద్రం మధ్య సాగుతున్న స్వామి రథం

చిలమత్తూరు, మార్చి 25: మండలకేంద్రం సోమవారం గోవింద నామస్మరణతో మార్మోగింది. కదిరి పున్నమిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న బ్రహోత్సవాల్లో భాగంగా కనుమ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవాన్ని సోమ వారం వైభవంగా నిర్వహించారు. మండే ఎండలను సైతం లెక్కచేయకుండా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామికి సుప్రభాత సేవతో ప్రారం భించి, ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం అర్చకులు స్వామి వారి బ్రహ్మరథానికి సంప్రోక్షణ చేపట్టారు. రథం ఎదుట హోమాలు చేశారు. ఆలయ సేవకులు సంప్రదాయ ప్రకారం మంగళవా వాయిద్యాలతో ఆలయానికి వెళ్లి స్వామి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి, పూల పల్లకిలో స్వామి వారిని తీసుకొచ్చి రథంపై ఆశీనులను చేశారు. ఈ సమయంలో ఆ ప్రాంతమంతా నారసింహ నమోనమః అనే నినాదం తప్ప మరేదీ వినపడలేదు. అనంతరం ముందుగా నిర్ణయించిన ముహూర్తంలో రథాన్ని లాగారు. ఈ సందర్భంగా భక్తులు దవనం, మిరియాలు, అరటిపండ్లను రథంపైకి విసిరి మొక్కులు తీర్చు కున్నారు. దిగువ బస్టాండు వరకు రథోత్సవం సాగింది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలే కాకుండా కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు.

రథోత్సవంలో పాల్గొన్న బీకే: కనుమ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవానికి టీడీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బీకే పార్థసారథి హాజరయ్యారు. అలాగే టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ [illegible] రావు, గ్రీన్‌పార్కు నాగరాజు, నాయకులు పరిమళ, జయప్ప, దేమకేతేపల్లి అంజనప్ప, బేకరీ గంగా ధర్, రామప్ప, నందీషప్ప, అశ్వత్థప్ప, శ్రీదేవి, బాలాజీ, శ్రీనివాసులు, చంద్ర మోహన్ తది తరులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, రథోత్సవంలో పాల్గొన్నారు.

నేడు టీడీపీలోకి భారీగా చేరికలు

ఓబుళదేవరచెరువు, మార్చి 25: మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరా సమక్షంలో మంగళవారం వైసీపీనుంచి టీడీపీలోకి భారీగా చేరనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర పేర్కొన్నారు. మండలకేంద్రంలోని స్టేట్‌బ్యాంక్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసే సమావేశంలో చేరికలు ఉంటాయన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

రమణాశ్రమంలో పౌర్ణమి వేడుకలు

ధర్మవరం, మార్చి 25: పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలోగల రమణ మహర్షి ఆశ్రమంలో సోమవారం ఆశ్రమవ్యవస్థాపకుడు చిప్పల వెంకప్ప ఆధ్వర్యంలో పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆశ్రమంలో అరుణాచలేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వచ్ఛమైన గోవు నెయ్యితో దీపాన్ని వెలిగించారు. రమణ భక్తులచేత అక్షరమణిమాల పారాయణం చేయించారు. మధ్యాహ్నం 1గంటకు నారాయణ సేవ చేశారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం, మార్చి 25: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉచిత విద్యకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఉందని ఎంఈఓ-2 గోపాల్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి గాను విద్యాహక్కు చట్టం ప్రకారం ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లు కేటాయించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ ప్రచారం

పుట్టపర్తి రూరల్, మార్చి 25: జిల్లాలో అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్‌పార్టీ ఎన్నికలలో పోటీ చేయనుందని ఆ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి విష్ణునారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండలంలోని బత్తలపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో తమపార్టీని గెలిపించాలని కోరారు.

అన్నదాన సత్రానికి రూ.20వేలు వితరణ

ఓబుళదేవరచెరువు, మార్చి 25: మండలంలోని అల్లాపల్లిపంచాయతీ దాదిరెడ్డిపల్లి సమీపంలో వెలసిన అన్నదాన సత్రానికి నల్లమాడ మండలం గోపేపల్లి గ్రామానికి చెందిన మీసాల గంగులప్ప, అక్కులప్ప, మల్లికార్జున, కవిత, సురేష్‌బాబు, అనితలు రూ.20వేలను సోమవారం వితరణ చేశారు. ఆలయ పూజారి వెంకటేష్‌కు ఆ మొత్తాన్ని అందజేశారు.

ఇంకా తొలగని వైసీపీ స్టిక్కర్లు



1వ వార్డులో ఇంటి గోడకు ఉన్న ఎమ్మెల్యే స్టిక్కర్

ముదిగుబ్బ, మార్చి25: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి వారం రోజులు కావస్తున్నా.. ఇంకా అక్కడక్కడ వైసీపీకి చెందిన స్టిక్కర్లు దర్శనమిస్తూనే ఉన్నాయి. దీన్ని బట్టి చూస్తుంటే సంబంధితాధికారులు ఎన్నికల నిబంధనలను సరిగా పాటించడం లేదనే విషయం అర్థమవుతోంది. మండల కేంద్రంలోని 1వ వార్డులో పలు ఇళ్ల గోడలపై వైసీపీ ఎమ్మెల్యే ప్రచారం స్టిక్కర్లు అలాగే ఉన్నాయి. వాటిని అధికారులు ఎప్పుడు తొలగిస్తారోనని స్థానికులు చర్చించుకుం టున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిని తొలగించాలి.

వెంకటేష్ అభిమానుల ఆర్థికసాయం

ధర్మవరం రూరల్, మార్చి 25: హిందూపురానికి చెందిన గోపి కుమార్తె బిందు అనారోగ్యంతో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు ఆపరేషన్ చేయాల్సి ఉంది. ఈ విషయాన్ని తెలుసుకున్న ధర్మవరానికి చెందిన సినీ హీరో వెంకటేష్ అభిమానులు సాకే చిన్న, సాకే కుళ్లాయప్ప, అలకుంట పోతలయ్య, రామకృష్ణ కలిసి ఆంధ్రప్రదేశ్ వెంకటేష్ హెల్పింగ్ హ్యాండ్స్ తరపున రూ.23వేల నగదును సోమవారం అందజేశారు. బత్తలపల్లి ఆస్పత్రికి వెళ్లి బిందు కుటుంబసభ్యులకు అందించారు. ఇందుకు వారికి గోపి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అపుస్మా యూనియన్ రాష్ట్ర నాయకుడు రామిరెడ్డి మృతి



అనంతపురం విద్య, మార్చి 25: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) స్టేట్ చీఫ్ కో-ఆర్డినేటర్, రుద్రంపేట బాలాజీ విద్యామందిర్ కరెస్పాండెంట్ రామిరెడ్డి సోమవారం మరణించారు. ఉన్నఫలంగా గుండెపోటు రావడంతో ఆయన్ను ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. బంధువులు, ప్రైవేట్ పాఠశాలల కరెస్పాండెంట్లు, అపుస్మా ఇతర సంఘాల నేతలు ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అపుస్మా జిల్లా అధ్యక్షుడు పుల్లారెడ్డి మాట్లాడుతూ.... ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ స్కూళ్లకు సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

పెనుకొండ, మార్చి 25 : కదిరి పున్నమి సందర్భంగా స్థానిక లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు పవన్ ఆధ్వర్యంలో ఉదయం 7నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 10 గంట నుంచి 12 గంటల వరకు హోమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం గావించారు.



హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

సోషల్ మీడియాలో వ్యక్తిగత విమర్శలు వద్దు: సీఐలు

మడకశిర టౌన్, మార్చి 25: సోషల్ మీడియా ద్వారా రాజకీయ నాయకుల పట్ల వ్యక్తిగత విమర్శలకు పాల్పడుతూ పోస్ట్ పెడితే... అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ మనోహర్, రూరల్ సీఐ రాజ్‌కుమార్ అన్నారు. వారు సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మడకశిర నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకారం అందించాలని కోరారు. సోషల్ మీడియాలో రాజకీయ నాయకుల పట్ల విమర్శలు ప్రతి విమర్శలు చేస్తూ వ్యక్తిగత విమర్శలకు పాల్పడడం గానీ, దూషించడం గానీ చేస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాని తెలిపారు. వాట్సాప్ గ్రూపులో, ఫేస్‌బుక్‌లో గ్రూపు అడ్మిన్‌లు జాగ్రత్తగా ఉండాలని తెలియజేశారు. పార్టీలను, వ్యక్తులను కించపరచడం తదితర వాటిపై నిఘా ఉంచుతామని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా తొమ్మిది చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 25 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. వాట్సాప్‌లో వచ్చిన కొన్ని అంశాలు ఒక్కొక్కసారి సమస్యాత్మకంగా ఉంటాయని జాగ్రత్త గా ఉండాలని పలుసూచనలు చేశారు. ఎన్నికల నియమావళిని ఎవరు అతిక్రమించిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా అయ్యప్పస్వామి జయంతి



అయ్యప్ప జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

గోరంట్ల, మార్చి 25: పట్టణంలోని పాత స్టేట్ బ్యాంక్ వద్ద అయ్యప్పస్వామి జయంతిని భక్తులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఫాల్గుణమాసంలో ఉత్తర నక్షత్రంలో జన్మించిన మణికంఠ స్వామికి గురుస్వామి తిప్పన్న ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం మణికంఠ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అయ్యప్ప భక్తులు అధికంగా వేడుకల్లో పాల్గొన్నారు.

కైవారం తాతయ్య జయంతి



కైవారం తాతయ్యను ఆరాధిస్తున్న భక్తులు

గోరంట్ల, మార్చి 25: పట్టణంలోని రావికుంట చెరువు కట్టవద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో కైవారం తాతయ్య జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. బలిజ సంఘం నాయకుడు గంగాధర్, ప్రమీల దంపతుల ఆధ్వర్యంలో కైవారం తాతయ్య చిత్రపటాని కి పూజలు చేశారు. కైవారం తాతయ్యను భజనలు, గీతాలాపనతో ఆరాధించారు. వేడుకల్లో పాల్గొన్న మహిళలకు పసుపుకుంకుమ, జాకీట్, గాజులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పుల్లేరు హరి, శంకర్, వేణుగోపాల్, లక్ష్మీపతి, శ్రీనివాసులు, రామప్ప తదితరులున్నారు.

అలరించిన ప్రేమభక్తి పర్వం



నాటికలో ఓ సన్నివేశం

పుట్టపర్తి, మార్చి 25: బీహార్ బాలవికాస్ విద్యార్థులు చేపట్టిన ప్రేమ భక్తి పర్వం నాటిక భక్తులను అలరించింది. పట్టణంలోని ప్రశాంతి నిలయంలో గల సాయికుల్వంత్ హాల్లో సోమవారం సాయంత్రం బీహార్ భక్తులు హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాలవికాస్ విద్యార్థులు మార్కండేయ పురాణంలోని ప్రహ్లాదుడి భక్తిని చాటుతూ అందులోని ఘట్టాలను నాటిక రూపంలో అద్భుతంగా ప్రదర్శించారు. అలాగే చిన్నారులు తమ నృత్యంతో భక్తులను మైమరపించారు. అనంతరం సత్యసాయి అష్టోత్తర శతనామపఠనం చేశారు. తదుపరి సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.వేడుకల్లో ఆ రాష్ట్రానికి చెందిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.



నృత్యంతో అలరిస్తున్న చిన్నారులు

హోరెత్తిన గోవిందనామ స్మరణ



జనసంద్రం మధ్య సాగుతున్న స్వామి రథం

వైభవంగా కనుమ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం

చిలమత్తూరు, మార్చి 25: మండలకేంద్రం సోమవారం గోవింద నామస్మరణతో మార్మోగింది. కదిరి పున్నమిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న బ్రహోత్సవాల్లో భాగంగా కనుమ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. మండే ఎండలను సైతం లెక్కచేయకుండా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామికి సుప్రభాత సేవతో ప్రారంభించి, ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం అర్చకులు స్వామి వారి బ్రహ్మరథానికి సంప్రోక్షణ చేపట్టారు. రథం ఎదుట హోమాలు చేశారు. ఆలయ సేవకులు సంప్రదాయ ప్రకారం మంగళవా వాయిద్యాలతో ఆలయానికి వెళ్లి స్వామి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి, పూల పల్లకిలో స్వామి వారిని తీసుకొచ్చి రథంపై ఆశీనులను చేశారు. ఈ సమయంలో ఆ ప్రాంతమంతా నారసింహా నమోనమః అనే నినాదం తప్ప మరేదీ వినడపలేదు. అనంతరం ముందుగా నిర్ణయించిన ముహూర్తంలో రథాన్ని లాగారు. ఈ సందర్భంగా భక్తులు ధవనం, మిరియాలు, అరటిపండ్లను రథంపైకి విసిరి మొక్కులు తీర్చుకున్నారు. దిగువ బస్టాండు వరకు రథోత్సవం సాగింది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలే కాకుండా కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు.

రథోత్సవంలో పాల్గొన్న బీకే : కనుమ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవానికి టీడీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బీకే పార్థసారథి హాజరయ్యారు. అలాగే టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, గ్రీన్‌పార్కు నాగరాజు, నాయకులు పరిమళ, జయప్ప, దేమకేతేపల్లి అంజనప్ప, బేకరీ గంగా ధర్, రామప్ప, నందీషప్ప, అశ్వత్థప్ప, శ్రీదేవి, బాలాజీ, శ్రీనివాసులు, చంద్ర మోహన్ తది తరులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, రథోత్సవంలో పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమాలు: రథోత్సవానికి హాజరైన భక్తుల కోసం దాతలు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. టీడీపీ తరఫున ప్రత్యేక అన్నదాన శిబిరం ఏర్పాటుచేశారు. భక్తులకు బీకే పార్థసారథి స్వయానా భోజనంతో పాటు మజ్జిగ, పెసర బేడలు, తాగునీరు అందించారు. అదేవిధంగా రాయలసీమ బలిజ సంఘం, రెడ్ల సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

బందోబస్తు: రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి భద్రతను ఏర్పాటుచేశారు. ప్రశాంతంగా ఉత్సవం ముగిసేందుకు చర్యలు చేపట్టారు.



ఉత్సవ విగ్రహాన్ని పల్లకిపై తీసుకెళ్తున్న బ్రాహ్మణులు



ఆలయానికి వెళుతున్న టీడీపీ నాయకులు



బలిజ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన జగన్

- సాగనంపుదాం
- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత



ప్రచారం నిర్వహిస్తున్న సవిత

పెనుకొండ టౌన్, మార్చి 25 : రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన జగన్‌ను సాగనంపాలని పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత అన్నారు. ఆమె సోమవారం పెనుకొండలో అర్బన్‌కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, అంబేడ్కర్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండు, తెలుగుతల్లి సర్కిల్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సవిత మాట్లా డుతూ... వైసీపీ అరాచక పాలనతో అన్ని ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడు తున్నారని అన్నారు. పోలవరం ప్రా జెక్ట్ పూర్తి చేయకపోవడంతో తాగు, సాగునీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. రోడ్లు గుంతలు పూడ్చలేని అసమర్థ ప్రభుత్వమన్నారు. ఈ ఐదేళ్ల వైసీపీ పాలనంతా ఆక్రమణలు, అక్రమాలు, దౌర్జన్యా లేనని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రజలు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లే నాయకుడు చంద్రబాబేనని గుర్తించి ఆయనను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. లేదంటే మన పిల్లల భవిష్యత్తు అంధకారమే నన్నారు. కార్యక్రమంలో సవిత భర్త వెంకటేశ్వర్‌రావు, టీడీపీ మండల మాజీ కన్వీ నర్ శ్రీరాములు, జిల్లా అధికార ప్రతినిధి రఘువీరచౌదరి, ఖన్నా, సుబ్రహ్మణ్యం, సామిల్ షౌకత్, మైనార్టీ నాయకుడు దాదు, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం

పెనుకొండ టౌన్ : ప్రతి కార్యకర్తకు టీడీపీ అండగా ఉంటుందని పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. ఆమె సోమవారం పట్టణంలోని అన్న క్యాంటిన్ కార్యాలయంలో జనసేన నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ జనసేన సైనికులు, వీరమహిళలు వైసీపీ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. టీడీపీమినీ మేనిఫెస్టోను, సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కుమార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా 21 కుటుంబాలు టీడీపీలో చేరాయి. పట్టణంలోని టీడీపీ కార్యాలయం లో సవిత వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. పరిగి మండలం గణపతి పల్లి, సోమందేపల్లి మండలం కొనతట్టుపల్లి, పందిపర్తి, పెనుకొండ మండలం గొల్లపల్లి, కొనతట్టుపల్లి, రొద్దం మండలం వాసులు పార్టీలో చేరారు.

డ్రగ్స్ ఆంధ్రాగా మార్చిన వైసీపీ

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్ కుమార్

మడకశిర టౌన్, మార్చి 25: వైసీపీ తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని డ్రగ్స్ ఆంధ్రాగా మార్చిందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ విమర్శించారు. వైపీపీ పాలకులు రాష్ట్ర రాజధానిగా చెప్పుకొంటున్న విశాఖ తీరంలో 25 వేల కిలోల డ్రగ్స్‌ను సీబీఐ, కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకోవడం అందుకు నిదర్శనమని అన్నారు. ఆయన సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.... ఈ డ్రగ్స్ రాకెట్ వెనుక వైసీపీ నేతల హస్తం ఉందని ఆరోపించారు. వైసీపీలోని మాఫియా రాష్ట్రాన్ని దేశానికి డ్రగ్స్ రాజధానిగా మార్చేసిందన్నారు. విశాఖ పోర్ట్‌లో 25వేల కిలోల డ్రగ్స్‌ను సీబీఐ స్వాధీనం చేసుకోవటం షాక్‌కు గురి చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో డ్రగ్స్ ద్వారా ఏం చేయాలని అనుకుంటున్నారో వారు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే పో లీసులకు పోర్ట్ ఉద్యోగులు సహకరించకపోవడాన్ని బట్టే ఇం దులో అధికార పార్టీ ప్రమేయం ఉందని స్పష్టమైందన్నారు. ఏపీకి ఎలా చేరా యన్నది ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఒకపక్క విశాఖపట్నంలో ఈ డ్రగ్స్ బ్రెజిల్ నుంచి వచ్చాయని, వైసీపీ నాయకులే ఈ ఆరాచకానికి పాల్పడుతు న్నారని ఆరోపించారు. ఇది సీఎం జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలనకు నిదర్శన మని అన్నారు. యువత భవిష్యత్తు తీవ్ర ప్రమాదంలో పడుతుందనే భయాన్ని తాజా ఘటన ధృవీకరిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న తదితరులు ఉన్నారు.

కియ పోలీస్ స్టేషన్‌లో తొలగని జగన్ బొమ్మ



కియ పోలీస్‌స్టేషన్ ఎదుట జగన్ బొమ్మతో ఉన్న హోర్డింగ్

పెనుకొండ రూరల్, మార్చి 25 : ఎన్నికల కోడ్ వచ్చి వారం రోజులు కావస్తున్నా కియ పోలీస్ స్టేషన్‌లో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బొమ్మ ఎదురుగా దర్శనమిస్తోంది. వైసీపీ ప్రభుత్వం మహిళా రక్షణలో భాగంగా ప్రతి పోలీస్ స్టేషన్ లోనూ సీఎం జగన్మోహన్ రెడ్డి ఫోటోతో పాటు రాష్ట్ర డీజీపీ, దిశ 100, 112, 181 నంబర్లతో యాప్‌ను సూచించే హోర్డింగ్ ఏర్పాటు చేసింది. అయితే ఎన్నికల కోడ్ వచ్చి వారం రోజులు అవుతున్నా కియ పోలీస్ స్టేషన్ ఎదుట ఈ బోర్డు ఉండటంపై స్థానికులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సాహంగా హోలీ పండుగ



మణూరు తండాలో హోలీ ఉత్సవాల్లో పాల్గొన్న యువకులు

మడకశిర రూరల్: హోలీ ఉత్సవాలను యువత సోమవారం ఎంతో ఆనందంగా జరుపుకొన్నారు. మండలంలోని తండాల్లో యువకులు ఉదయం నుంచి రంగులు చల్లుకున్నారు. సోదరభావంతో స్వీట్లు తినిపించుకోన్నారు.

'పురం'లో టీడీపీ ప్రచారం ప్రారంభం

ముందుగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు



చెర్లోపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పురం నాయకులు

హిందూపురం/లేపాక్షి, మార్చి 25: ప్రతి ఎన్నికల్లో మాదిరిగానే ఈసారి కూడా తెలుగుదేశంపార్టీ నాయకులు సెంటిమెంట్ పాటిసూ మొదట ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ఆయా మండలాల్లో స్థానిక నాయకులు ప్రారంభించారు. ఈ ప్రాంతంలో కదిరి పున్నమి పండగ ఘనంగా జరుపుకుంటారు. దీంతో సోమవారం మంచి రోజని భావించి చెర్లోపల్లి వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు మండలాల్లో ఉదయం 11.40కు ఆయా ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం హిందూపురం మండలం చెర్లోపల్లి, బాలంపల్లిలో మండల నాయకులు ప్రచారం చేపట్టారు. లేపాక్షి మండలం కొండూరు ఆంజనేయ స్వామి ఆలయంలో పూజల అనంతరం ప్రచారం ప్రారంభించారు. కార్యక్రమాల్లో టీడీపీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, మండల కన్వీనర్లు అశ్వత్థనారాయణరెడ్డి, జయప్ప, నాయకులు నాగరాజు, హిందూపురం రూరల్ మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లేపాక్షిలోనూ పలువురు నాయకులు ప్రచారానికి తరలి వచ్చారు. చిలమత్తూరు మండలం సోమగట్ట లక్ష్మీనరసింహస్వామి ఆల యంలో చిలమత్తూరు మండలం నాయకులు పూజలు నిర్వహించి గ్రామంలో ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం నాయకులు మాట్లాడు తూ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హ్యాట్రిక్ కొట్టడం తథ్యమని, ఈసారి అత్యధి క మెజార్టీతో గెలుపొందుతారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి అభ్యర్థులు, ఘన విజయాలు పొందుతారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను, వైసీపీచేస్తున్న దుర్మార్గ పాలనను ప్రజలు గమనించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో జనసేన పార్టీ నాయకులు కూడా పాల్గొన్నారు.



కొండూరులో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

ఆలయాల్లో టీడీపీ కార్యకర్తల పూజలు



ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న టీడీపీ శ్రేణులు

పెనుకొండ, మార్చి 25 : టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథిని హిందూపురం పార్లమెంట్ టిక్కెట్టును అధిష్టానం కేటాయించడంతో పారట్ట కార్యకర్తలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ బీసీ సాధికార కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు బోయ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఊరువాకిలి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి 101టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

గోపాలకృష్ణకు గుండుమల పరామర్శ



గోపాలకృష్ణను పరామర్శింస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్, మార్చి 25 : ఇటీవల జరిగిన దాడిలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు గోపాల కృష్ణ గాయ పడిన విషయం విదితమే. ఈ విషయం తెలుసుకొన్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పే స్వామి సోమవారం ఆయన ఇంటి వెళ్లి పరామర్శించారు. జరిగిన ఘటనపై అరా తీశారు. భూమి విషయంలో జరిగిన దాడి గురించి అడిగి తెలుసుకొన్నారు. ఇలాంటి సంఘటనలకు ఆస్కారం లేకుండా అధికారులు సమస్యలు పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, నాయకులు కట్టకిశోర్, మనోహర్, భక్తర్, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

టీడీపీ గెలుపే ధ్యేయంగా పనిచేద్దాం

ఇంటింటి ప్రచారంలో నాయకులు

అగళి, మార్చి 25: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు నియోజకవర్గంలో టీడీపీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. నాయకులు గోవిందప్ప, కేతప్ప, నాగోజీ, కృష్ణా రెడ్డి రామక్రిష్ణ, శివలింగప్ప, దినేష్, అలీఖాన్, చిదానందప్ప తదితరులు సోమవారం మండలకేంద్రంలో ఇంటింటా ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు తెలియజేశారు. పార్టీలో భేదాభిప్రాయాలు విడనాడి అందరం కష్టపడి పనిచేద్దామన్నారు. మడకశిర నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగురవేయాలని కోరారు. టీడీపీ హయాంలో చంద్రబాబు మకడశిరను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తే నియోజకవర్గంలో నిలిచి పోయిన అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేశారు.

నేడు శంకరగల్లులో టీడీపీ ప్రచారం

గుడిబండ, మార్చి 25 : మండలంలోని శంకరగల్లు గ్రామం నుంచి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు తెలుగు రైతు నియోజకవర్గం ఉపాధ్యక్షుడు మండలపల్లి మారేగౌడ్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శంకరగల్లుతో పాటు కెంచయ్యపాళ్యం, రాళ్లపల్లి, ముదిగుబ్బ, ఎన్ఆర్ రొప్పం, మైదుగానిపల్లి, కల్లురొప్పం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయనకోరారు.

'వడ్డెర్లను విస్మరించిన రాజకీయ పార్టీలు'



సమావేశంలో పాల్గొన్న వడ్డెర్లు

గోరంట్ల, మార్చి 25: పట్టణంలోని సరస్వతి విద్యామందిరంలో గోరంట్ల, చిలమత్తూరు మండలాల వడ్డెర సంఘం నాయకులు సోమవారం సమావేశమయ్యారు. రాజకీయ పార్టీల తీరుపట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయవాది ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా వడ్డెర్లు దాదాపు 40లక్షల ఓట్లు ఉన్నాయన్నారు. జనాభా ప్రతిపాదిక రెండు ఎమ్మెల్యే, రెండు ఎంపీ స్థానాలను తమ వర్గీయులకు కేటాయించాలని కోరామన్నారు. అయితే ఒక్కసీటు కూడా వడ్డెర్లకు కేటాయించ లేదన్నారు. కావున ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వడ్డెర్లు స్వతంత్రంగా పోటీ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు వేముల గోవిందురాజులు, సుధాకర్, కవి మహేష్,సోముశేఖర్, త్యాగరాజు, సురేంద్ర, మహేంద్ర, రాము, రమేష్, మనోహర్, శ్రీనాథ్ తదితరులున్నారు.

ఆర్మీ మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న సెబ్ అధికారులు

ధర్మవరం, మార్చి 25: పట్టణంలో శాంతినగర్‌లోని ఓ ఇంటిలో నిల్వ ఉన్న 12 ఆర్మీ మద్యం బాటిళ్లను స్వా ధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐలు గురుప్రసాద్, రాజన్న తెపా రు. పుట్టపర్తి అడిషన ల్ ఎస్పీ నాగభూషణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సుబ్రమ ణ్యం ఆదేశాల మేరకు శాంతినగర్‌లో పలు ఇళ్లలో దాడులు చేశామన్నారు. అందు లో బత్తల శ్రీనివాసులు ఇంటిలో 12 ఆర్మీ మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం అతన్ని అరెస్టు చేశామన్నారు. దాడుల్లో సెబ్ సిబ్బంది గిరీశ్‌కుమార్, మల్లికార్జున, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాటమయ్య ఉత్సవాలు

బత్తలపల్లి మార్చి25: మండలంలోని సంజీవపురం కాటమయ్య స్వామి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం రాత్రి స్థానిక కొండ వద్ద భక్తుల నడుమ లంకా దహనం జరిగింది. తొలుత మండలంలోని ముష్టూరుకు చెందిన కరణం కుటుంబీకులు ఊరేగింపుగా రెడ్డివారి ఇంటికి వెళ్లి అక్కడ తేనేటి విందు స్వీకరించారు. అనంతరం ఇరు కుటుంబాల వారు కలిసి ఊరేగింపుగా కొండ వద్దకు చేరుకుని స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఉత్సవ మూర్తిని పురవీధుల్లో ఊరేగించారు. తర్వాత లంకాదహనం నిర్వహించారు. పెద్దఎత్తున బాణసంచా కాల్చి లంకాదహనం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.